క్లుప్తంగా

నేడు ఎం.నిడమానూరులో వైద్య శిబిరం

టంగుటూరు: మండలంలోని ఎం.నిడమానూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి ప్రసాద్ బాబు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉండి అన్ని రకాల జబ్బులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభకు తరలిన నాయకులు



టంగుటూరు నుంచి బయలుదేరుతున్న వరికూటి, పార్టీ ముఖ్య నాయకులు

టంగుటూరు: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభకు కొండపి నియోజకవర్గ నాయకులు తరలివెళ్లారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో టంగుటూరులోని పార్టీ కార్యాలయం నుంచి వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఆరు మండలాల అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ ముఖ్య నేతలు ప్రత్యేక వాహనాల్లో ర్యాలీగా వెళ్లారు.

రూ.4.25 కోట్ల పనులు గుర్తింపు



గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

సింగరాయకొండ: మండలంలోని పాకల తుఫాను షెల్టర్ వద్ద సోమవారం ఉపాధి హామీ పథకం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ షేక్ జమీఉల్లా మాట్లాడుతూ.. గ్రామంలో ఈ ఏడాది చేపట్టేందుకు రూ.4.25 కోట్ల విలువైన అభివృద్ధి పనులు గుర్తించినట్లు తెలిపారు. మండలంలో ఏటా అత్యధికంగా పాకలలో ఉపాధి హామీ పథకం పనులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏపీఓ సీహెచ్ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి షేక్ సుబానీ, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు వీడియో క్లాస్‌రూమ్ ప్రారంభం

ఉలవపాడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం వీడియో క్లాస్ రూమ్ ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ జిలానీబాషా తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి, సబ్‌కలెక్టర్ శోభికలు పాల్గొంటారన్నారు. అనంతరం లైబ్రరీలో కెరీర్ గైడెన్స్ సెల్ కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతుందని, అందరూ హాజరు కావాలని కోరారు.

అభయాంజనేయ విగ్రహ నిర్మాణానికి విరాళం



విరాళం అందచేస్తున్న వెంకట్రావు

గుడ్లూరు: మండల కేంద్రమైన గుడ్లూరులోని నీలకంఠేశ్వర ఆలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న అభయాంజనేయ స్వామి విగ్రహ నిర్మాణానికి గ్రామానికి చెందిన దామా వెంకట్రావు రూ.50 వేలను విగ్రహ కమిటీ సభ్యులు పారా జనార్దన్, వెజండ్ల వెంకటరామ రాజులకు సోమవారం అందచేశారు. విగ్రహ నిర్మాణానికి విరాళాలు అందచేస్తున్న దాతలకు కమిటీ తరుపున ధన్యవాదాలు తెలియచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో విగ్రహ కమిటీ సభ్యులు దామా బ్రహ్మయ్య, చెన్నారెడ్డి శివ న్నారాయణలు పాల్గొన్నారు.

మూడు ట్రాక్టర్లు స్వాధీనం

గుడ్లూరు: గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఇరిగేషన్ అధికారులు ఆదివారం రాత్రి మండలంలోని మోచర్లలో స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే..పెద్ద చెరువులో నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న ఇరిగేషన్ జేఈ వెంకటరమణ సిబ్బందితో దాడి చేసి మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. వాటికి రూ.10 వేల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. అనుమతులు లేకుండా చెరువుల నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏడుగురు జూదరులు అరెస్టు

టంగుటూరు: మండలంలోని అనంతవరం పంచాయతీ పరిధిలోని వెంకటాయపాలెం గ్రామ శివారులో పేకాట శిబిరంపై సోమవారం ఎస్సై ఖాదర్ బాషా తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.18,030 నగదు, సెల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

జగనన్న సురక్ష పేదలకు వరం

హనుమంతునిపాడు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల చెంతకే ఆరోగ్య సేవలు వచ్చాయని ఎంపీడీఓ కె.లలిత అన్నారు. మండల పరిధి నందనవంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 300 మందిని పరీక్షించి కిట్లు పంపిణీ చేశారు. ఈఓఆర్డీ షేక్ షరీఫ్, సర్పంచ్, ఎంపీటీసీ, వైద్యులు పాల్గొన్నారు.

పామూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో పట్టణ స్థాయి నుంచి గ్రామ స్థాయివరకు మెరుగైన కార్పొరేట్ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుస్సేన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మోపాడులో సోమవారం సర్పంచ్ చప్పిటి వరలక్ష్మి అధ్యక్షతన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియర్షానంద్, కిరణ్, విజయ్‌కుమార్, నరేంద్రలు 385 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కోఆప్షన్ నాయబ్‌రసూల్, పట్టణ అధ్యక్షుడు చాంద్‌బాషా, చప్పిడి రామయ్య, పీఎస్.నాగేశ్వరరావు, బొమ్మన శ్రీనివాసులు, జే.గోవిందయ్య, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, జక్కు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్ల: జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందుతుందని ఎంపీడీఓ సుకుమార్ అన్నారు. మండలంలోని గుడిపాటిపల్లి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరం వద్ద అంగన్‌వాడీల ఆధ్వర్యంలో స్టాల్‌ను ఏర్పాటు చేశారు. సర్పంచ్ కటికల రిబ్కా, ఎంపీటీసీ పి.నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కటికల వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శి షేక్ షకీల, వైద్యబృందం, సచివాలయ ఉద్యోగులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పీసీపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అన్నారు. మండల పరిధిలోని వరిమడుగులో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం సేవలందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ సచివాలయ పరిధిలో జరిగే ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యపరీక్షలు చేయించుకొని ఆరోగ్య సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. వైద్యాధికారి రాజ్యలక్ష్మి, సర్పంచ్ నరేంద్ర చౌదరి, నాయకులు పాల్గొన్నారు.



పౌష్టికాహార స్టాల్ పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



మోపాడులో కిట్లు అందజేస్తున్న ఎంపీడీఓ

కనిగిరి రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం లాంటిదని సర్పంచ్ ధనలక్ష్మి, ఎంపీటీసీ దేవసాయం అన్నారు. మండలంలోని బల్లిపల్లి పంచాయతీలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో వైద్యులు తులసీదాస్, ఎస్కే రేష్మా, జేరుషా జాస్మిన్, ఏ శ్రీనివాసులరెడ్డి వైద్య సేవలందించారు. 545 ఓపీలు రాగా 75 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 8 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కె.మోహన్‌రావు, సీహెచ్‌ఓ పులి నాగముణెమ్మ, ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు, ఈఓఆర్‌డీ అన్నమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాశం నాగరాజు, బాలస్వామి, మల్లికార్జునరావు, వైద్యసిబ్బంది, స్థానిక నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి సంపూర్ణ రక్షణగా నిలుస్తోందని తహసీల్దార్ షేక్ నాగూర్‌మీరా, ఎంపీడీఓ సీహెచ్.రామచంద్రరావు అన్నారు. మండలంలోని చింతపూడి సచివాలయంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించగా..తహసీల్దార్, ఎంపీడీఓ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. పేద, ధనిక తేడా లేకుండా అందరికీ కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతోనే వైద్యశిబిరం నిర్వహిస్తున్నారన్నారు. డాక్టర్ మురళి, రాజేష్, శ్రీరమ్యలు 580 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు. ఈఓఆర్డీ కె.సుందరరామయ్య, సర్పంచ్ ముప్పాళ్ల సరోజమ్మ, కంభంపాడు సర్పంచ్ మర్రి రామయ్య, ఎంపీటీసీ పి.లలితమ్మ, ముప్పాళ్ల వసంతకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.దేవకృపావరం, సచివాలయ కన్వీనర్ చిట్లా శివ, మోరం మొరార్జి, సీహెచ్‌ఓ ఆర్.హరికిరణ్, మురళి, మహిళాపోలీస్, వీఆర్ఓ మాల్యాద్రి, మహేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

● డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి

సింగరాయకొండ: ప్రజారోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని డీఎంహెచ్‌ఓ ఎస్.రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని పాకల గ్రామ సచివాలయం–2 పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. 865 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు డాక్టర్ వంశీధర్ వివరించారు. ఎంపీడీఓ షేక్ జమీఉల్లా, డాక్టర్లు ధీరేందర్‌కుమార్, ఉజ్వల, స్పెషలిస్టు డాక్టర్లు, ఎంపీటీసీలు గోళ్లమూడి అశోక్‌కుమార్‌రెడ్డి, ఏపూరి శ్రీనివాసులు, కొండూరి అంకయ్య, ఉప సర్పంచ్ బల్లెల ప్రభాకరరెడ్డి, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

378 మందికి వైద్య పరీక్షలు

ప్రతి ఒక్కరు పూర్తి ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాకా పిచ్చిరెడ్డి అన్నారు. కొండపి మండలం కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. 378 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి పి.అనూష వివరించారు. ఎంపీడీఓ రమణమూర్తి, డాక్టర్లు ప్రియాంక, కీర్తి, గీత, నాయకులు శంకరరెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జరుగుమల్లి: ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని, జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జరుగుమల్లి ఎంపీడీఓ కె.జలజాక్షి పేర్కొన్నారు. మండలంలోని చిరికూరపాడు సచివాలయ పరిధిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎంపీడీఓ హాజరయ్యారు. తహసీల్దార్ యస్.ఉషారాణి, డాక్టర్లు గంగా శిరీషా, పి.సుధీర్, జి.రేష్మి, సీహెచ్ సరస్వతి, పి.వెంకటేశ్వరరావు, ఎంపీ రాజ్‌కుమార్. చిరికూరపాడు సర్పంచ్ మెడబలిమి కోటేశ్వరమ్మ, దావగూడూరు సర్పంచ్ చెన్నారెడ్డి రామ్మూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

పొన్నలూరు: రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని సర్పంచ్ కాలే అయ్యన్న అన్నారు. మండలంలోని చెరుకూరు గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కల్పన, పీహెచ్‌సీ డాక్టర్లు కీర్తి, కృష్ణచైతన్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్రెపాటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిపూడి: మండలంలోని ధర్మవరం గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో తహసీల్దార్ హరిబాబు పాల్గొన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించే లక్ష్యంతో గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సంగీత, కీర్తిశ్రీ, సర్పంచ్ గంగిరెడ్డి రమణారెడ్డి, వీఆర్ఓ ఏబేలు, సీహెచ్‌ఓ నాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నందనవనంలో వైద్య శిబిరం



గుడిపాటిపల్లిలో మందులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ



బల్లిపల్లిలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం



చెరుకూరులో మందులు అందజేస్తున్న ఎంపీడీఓ కల్పన



సింగరాయకొండలో వృద్ధురాలికి మందులు అందజేస్తున్న డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి



కొండపి మండలం కె.ఉప్పలపాడులో వైద్య పరీక్షలు



జరుగుమల్లిలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ



ధర్మవరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సంగీత

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



కొండికందుకూరులో పౌష్టికాహారాన్ని అందిజేస్తున్న ఎంపీడీఓ



పూరేటిపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

కందుకూరు రూరల్: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రవేశపెట్టిందని ఎంపీడీఓ పి.విజయశేఖర్ అన్నారు. మండలంలోని కొండికందుకూరులో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేదల ప్రజలు ఆరోగ్యంపై ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఉండేందుకు మీ ఇళ్ల వద్దకే నాణ్యమైన వైద్యం తీసుకువచ్చామన్నారు. ముందుగా ప్రతి కుటుంబాన్ని సచివాలయ వైద్య సిబ్బంది కలిసి ఆరోగ్య పరిస్థితిని నమోదు చేసుకున్నారన్నారు. ఆ రిపోర్టుల ద్వారానే నిపుణులైన వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఏదైనా వ్యాధులకు ఆపరేషన్ అవసరమైనా పెద్దాస్పత్రులకు సిఫార్సు చేస్తామన్నారు. అక్కడ కూడా ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. ఆపరేషన్ తర్వాత ఆ వ్యాధిగ్రస్తుల ఆరోగ్య స్థితిగతులను బట్టి కుటుంబ పోషణలకు పింఛన్ ఇస్తామన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. మాచవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కేపీ.స్వాతి, ఎంఈఓ కె.సుబ్బారావు, సీడీపీఓ షర్మిష్ట, వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లూరు: మండలంలోని పూరేటిపల్లి సచివాలయం వద్ద సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 417 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి మారుతీరావు తెలిపారు. వైద్య శిబిరాన్ని వైస్ ఎంపీపీ వరలక్ష్మమ్మ, సర్పంచ్ కొండమ్మ ప్రారంభించారు. పేద మధ్య తరగతి కుటుంబాలకు మెరుగైన వైద్యసేవలు అందిచడమే కార్యక్రమ లక్ష్యమన్నారు. వైద్యులు ప్రసాద్, శ్రీనివాసరావు, కిరణ్, మారుతీరావు, సబీహా సుల్తానాలు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. ఆపరేషన్లు అవసరమైన 33 మందిని వివిధ వైద్యశాలలకు సిఫార్సు చేసినట్లు మారుతీరావు తెలిపారు. ఎంపీడీఓ రాజశేఖరరావు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, సీహెచ్‌ఓ భాస్కరరావు, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం

లింగసముద్రం: స్థానిక వేముల అంజయ్య కల్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం 3.30 గంటలకు మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి ఎందుకు కావాలనే అంశంపై సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జేసీఎస్ కన్వీనర్ వరికూటి కృష్ణారెడ్డి, కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

గుడ్లూరు: స్థానిక జీకేఎల్ కల్యాణ మండపంలో ఏపీకి జగన్ ఎందుకు కావలన్న అంశంపై బుధవారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ కావులూరు క్రిష్ణయాదవ్, జేసీఎస్ కన్వీనర్ గాజుల కిషోర్ సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. 24 గ్రామాల పంచాయతీల నుంచి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ఈ వర్క్‌షాపుకు హాజరు కావాలని వారు కోరారు.

మత్స్యకారుల్లో ఆనందం

సింగరాయకొండ: మండలంలోని పాకల, ఊళ్లపాలెం సముద్ర తీరంలో మత్స్య సంపద సమృద్ధిగా లభిస్తుండటంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది నెలలుగా వాతావరణం అనుకూలించక, మరోపక్క కడలూరు సోనాబోట్ల కారణంగా మత్స్య సంపద లభించలేదు. ఒక దశలో పెట్టుబడి ఖర్చులు కూడా రాకపోవడంతో మత్స్యకారులు వేట విరమించుకున్నారు. ప్రస్తుతం సముద్రంలో చేపలు బాగా పడుతున్నాయని మత్స్యకారులు తెలిపారు.

సోమవారం చేపల వేటకు వెళ్లిన జాలర్లకు కానాగంత, గుడ్ల గొరక చేపలు లభించాయి. కానాగంత కేజీ 100 రూపాయలు ఉండగా, గుడ్ల గొరక కేజీ 400 రూపాయలు ఉంటుందని మత్స్యకారులు వివరించారు.



వలలకు చిక్కిన చేపలను చూస్తున్న మత్స్యకారులు

సమస్యలపై సీఎంకు వినతి

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధుల సదస్సులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సింగరాయకొండ మండల సమస్యలను అర్జీ రూపంలో తెలియజేసినట్లు ఆ పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని బైరాగిమాన్యంలో ఉన్న 440 ఎకరాల ఎండోమెంట్ భూముల రిజిస్ట్రేషన్ సమస్య, రూర్బన్ గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.14 కోట్ల నిధులు, రూ.2 కోట్లతో ట్రంకు రోడ్డు నిర్మాణం, శానంపూడి రోడ్డు, అలాగే క్రిస్టియన్ శ్మశానవాటికకు రూ.15 లక్షలతో ప్రహరీ నిర్మాణం, పాకల గ్రామంలో రూ.78 లక్షలతో చెక్ డ్యామ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించారని చెప్పారు.

డిప్యూటీ డీఈఓ పరిశీలన



పాఠశాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ

ఉలవపాడు: మండల పరిధిలోని పెదపట్టపుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కందుకూరు డిప్యూటీ డీఈఓ ఎ.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని పరిశీలించి పాఠశాల రికార్డులు తనిఖీ చేశారు. శానిటేషన్ ఎలా ఉందని గమనించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. సిలబస్‌ను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. పాఠశాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు సలీమ్ బాషా, సిబ్బంది ఉన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

పామూరు: స్థానిక నాల్గవ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం ఉదయం 9 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు తెలిపారు. సచివాలయ పరిధిలోని ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని చెన్నపునాయునిపల్లె ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఉదయం 9 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్.రామచంద్రరావు తెలిపారు. సచివాలయ పరిధిలోని ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పందనకు 17 అర్జీలు

కనిగిరి రూరల్: స్థానిక ఆర్డీఓ ఆఫీసులో సోమవారం జరిగిన స్పందనలో 17 అర్జీలు వచ్చాయి. కనిగిరి మండలం నుంచి 3, కేకేమిట్ల 2, హెచ్ఎం పాడు 5, పామూరు 4, సీఎస్‌పురం 2, మర్రిపూడి నుంచి ఒక అర్జీని ఆర్డీఓ తోట అజయ్‌కుమార్‌కు స్పందనలో అందచేసినట్లు స్పందన వీఆర్వో రఘురామయ్య తెలిపారు. వాటిని పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ అజయ్‌కుమార్ అన్నారు. డీఏఓ జయవర్ధన్, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

వెలిగండ్ల: స్పందనలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ ఎన్ వాసు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన 4 అర్జీల్లో పొలం ఆన్‌లైన్ చేయాలని, అసైన్‌మెంట్ భూమిని ఆక్రమించుకున్నారని, జాయింట్ ప్రాపర్టీ సబ్ డివిజన్ చేయాలని, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్ కోసం అర్జీలు దాఖలయ్యాయన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు



దాడుల్లో పాల్గొన్న విద్యుత్ శాఖ అధికారులు

జరుగుమల్లి: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. విద్యుత్ డీపీఈ ఈఈ టి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 34 బృందాలు మొత్తం 2040 సర్వీసులను తనిఖీ చేశాయి. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 9 మందిపై కేసులు నమోదు చేసి రూ.76 వేలు జరిమానా విధించారు. అదనపు లోడు వినియోగించుకున్న 147 సర్వీసులను గుర్తించి రూ.4,22,000 అపరాధ రుసుం వేశారు. దాడుల్లో కందుకూరు డివిజన్ ఈఈ డి.వీరయ్య, సింగరాయకొండ డీఈఈ పి.యుగంధర్, డీపీఈఓ ఈఈ పి.శ్రీనివాసరావు, జరుగుమల్లి ఏఈ జి.హర్షిష్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

110 మందికి వాటర్‌బాటిళ్లు అందజేత



వాటర్ బాటిళ్లు అందుకున్న విద్యార్థులతో దాత, హెచ్‌యం, ఉపాధ్యాయులు

సీఎస్‌పురం (పామూరు): ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు దాతలు తాగునీటి వసతి కల్పనలో భాగంగా వాటర్‌బాటిల్స్ సమకూర్చి అందజేయడం అభినందనీయమని పాఠశాల హెచ్ఎం చాంద్‌బాషా, రాష్ట్ర మానవహక్కుల కమిషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్కే.గౌస్ అన్నారు. మండలంలోని చెన్నపునాయునిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పాఠశాలలోని విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత దుద్దేదుల శేషు తన సొంతనిధులు రూ.11 వేలతో 110 మందికి పాఠశాల హెచ్ఎం ఎస్ఎం చాంద్‌బాషా చేతులమీదుగా వాటర్ బాటిళ్లు అందజేశారు. పెరుగు సుబ్బరామయ్య, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు బోర్డు ద్వారా ఎరువుల సరఫరా ప్రారంభం

ఒంగోలు సెంట్రల్: పొగాకు బోర్డు ద్వారా అందిస్తున్న ఎరువులను ఉపయోగించుకోవాలని గుంటూరు పొగాకు బోర్డు విస్తరణాధికారి దామోదరరావు సూచించారు. పొగాగు బోర్డు వేలం కేంద్రం –23 పరిధిలో సోమవారం రైతులకు ఎరువుల పంపిణీని ప్రారంభించారు. బోర్డు రీజినల్ మేనేజర్ ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ పొగాకు సాగు చేసే రైతులు ఎరువుల కోసం నమోదు చేసుకున్న తర్వాత బ్యారన్ రెన్యువల్ చేయించుకుని ఎరువులు తీసుకెళ్లాలని కోరారు. ఫ్యాక్ట్ వారి అమ్మోనియం సల్ఫేట్, ఐపీఎల్ వారి డీఏపీ, ఎస్ఓపీ ఎరువులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.